# ముగింపు కథ

కథన: శ్రీ రేగులపాటి కిషన్‌రావు

(గత సంచిక తరువాయి)

యాదగిరి చిక్కుడు చెట్టు వద్దకు వచ్చి దాని కాయలు తెంప సాగాడు. శారద వంకాయలు తెంప సాగింది. గంప నిండక ముందే వాన చినుకులు ప్రారంభ మయ్యాయి.

శారద గబగబా పరుగెత్తి వచ్చి, గుడిసెలో కూర్చుంది. యాదగిరి ఇంకా చిక్కుడు కాయలు తెంపుతూనే ఉన్నాడు. వాన అధికం కాసాగింది. "గిరీ! ఆ గంప తీసుకొని రా" అందామె.

యాదగిరి గంపను గుడిసెలో పెట్టేసి కూర్చున్నాడు.

వాన....వాన....వాన....వాన కురుస్తూనే ఉంది. గాలి ... వాన....గాలి వాన. ఉరుములు మెరుపులు....చెట్లు ఊగుతున్నాయి బలంలేని చెట్లు విరుగుతున్నాయి.

భయంకరమైన శబ్దం - విన్పించింది. చెవులు చిల్లులు పడేంత శబ్దం! పిడుగు తన మీదే పడ్డట్టు కెవ్వున కేక వేసిన శారద యాదగిరిని అలుముకొంది,

"అదేమి టమ్మాయి గారూ! భయపడ్డారా?" యాదగిరి శారద వీపులో అరచేతితో చరిచాడు. శారద యాదగిరిని మరింత బిగ్గరగా అలుముకొంది!

ఆ గుడిసెమీద పడుతున్న మల్లెతీగ వాళ్ళను చూచి నవ్వింది! మల్లెపూల వానన ఆ గుడిసెలోకి పరుగెత్తి వచ్చింది.

పరిసరాలు కనిపించకుండా వాన కురుస్తూనే వుంది. నీరు పరుగెత్తుతూనే వుంది.

యాదగిరిలో రాముణ్ని చూచింది శారద. శారదలో సీతను చూచాడు యాదగిరి.

* * *

"శారదా! ఇలారా తల్లీ," విశ్వనాథం పిలుపు విన్పించగానే సొరకాయ కోస్తున్న శారద దానిని అక్కడ వదిలేసి తండ్రి దగ్గరకు వచ్చింది.

సంవత్సరం నుండి శారదకోసం సంబంధాలు వెదకుతూనే వున్నాడు విశ్వనాథం. అతనికి వచ్చిన సంబంధం ఇప్పుడు దొరికింది. వరకట్నం విషయం ఎలా వున్నా పిల్లవాడు అందగాడు! వినయ విధేయతలు కలిగినవాడు. విద్య నేర్చినవాడు, ఈ సంబంధం శారదకు నచ్చితే పెళ్లి చేసెయ్యాలన్న ఉద్దేశంతో వున్నాడు.

శారదకు విషయం వివరించి చెప్పాడు.

శారద మాట్లాడకుండా ఏదో ఆలోచింప సాగింది.

"చిన్నా! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నాన్నా! మీరు చాలామంచి తండ్రుల్లాగా కాకుండా నా అభిప్రాయానికి విలువ యిచ్చే మనస్తత్వం కలిగినవారు కనుక నా అభిప్రాయాన్ని సూటిగా మీకు చెప్పాలని వుంది! చెప్పమంటారా?"

"చెప్పు!"

"మీరు నాకోసం పెళ్ళిచూపులు ఏర్పాటు చెయ్యకండి"

"నీ అభిప్రాయం ఏమిటో నాకు అర్థం కావడం లేదమ్మా?"

"నే నొక శ్రమజీవిని ప్రేమించాను. ఒక నిర్మల హృదయుణ్ని ప్రేమించాను. అతడు నన్ను అభిమానిస్తున్నాడు. ఆరాధిస్తున్నాడు. నేను అతనినే పెళ్ళి చేసుకుంటాను."

"ఎక్కడ ఉన్నాడమ్మా ఆ వ్యక్తి?"

"మీరు రోజూ చూస్తూనే వుంటారు నాన్నా!"

"రోజూ చూస్తుంటానా? ... ... నీ మనసులో వున్న ఆ వ్యక్తి ఎవరో అర్థమైనట్టూ వుంది. అర్థం కానట్టూ వుంది. ఇంకా దాపరిక మెందుకు? పేరు బయట పెట్టు చిన్నా!"


"యాదగిరి"

"అంటే మన పాలేరు యాదగిరిని నువ్వు పెళ్ళి చేసుకుంటావా?"

"అవును....నా నిర్ణయం మీకు నచ్చలేదా నాన్నా!"

"యాదగిరి శ్రమజీవి అంటే ఒప్పుకుంటాను. నిర్మల హృదయుడంటే ఒప్పుకుంటాను. అతడు నిన్ను అభిమానించే వ్యక్తి కావచ్చు....ఆరాధించే వ్యక్తి కావచ్చు - కాని పేదవాడు.

"ఒకప్పుడు మీరు కూడా పేదవారే కదా నాన్నా! కష్టపడి పని చేసి పంటలు పండించి అభివృద్ధి చెందలేదా? కష్టపడి పని చేసే యాదగిరి కూడా అభివృద్ధి చెందుతాడనే నా సంపూర్ణ విశ్వాసం!"




"లేనివాడు సంపాదించుకోవచ్చు. ఉన్నవాడు పోగొట్టుకోవచ్చు. అవి వేరే విషయం - కాని యాదగిరి కులం తక్కువ వాడు....

"అవి మీ రంటున్నారా నాన్నా !"

"నేననడం కాదమ్మా ! నాకు కులమతాల పట్టింపు లేదు. ఆ విషయం నీకూ తెలుసు. కాని ఎవరైనా నువ్వు కులం తక్కువ వాణ్ని పెళ్ళాడావని విమర్శిస్తే తట్టుకునే శక్తి నీకుందా !"

"ఇతరుల విషయం తర్వాత ఆలోచిద్దాం. ముందు మీ అభిప్రాయం చెప్పండి నాన్నా ! యాదగిరి మీకు అల్లుడు కావడం మీకు ఇష్టం లేదా ?"

"నా అభిప్రాయం తర్వాత చెప్తాను. నువ్వు ఇంకా బాగా ఆలోచించుకో, యాదగిరి మన స్తత్వాన్ని సమగ్రంగా అర్థం చేసుకో !

* * *

"శారీ ! నాన్న నాకు పెళ్ళి చేస్తానంటున్నారు."

"మరి మీ రేమన్నారు ?"

"యాదగిరి ఎప్పుడు పెళ్ళి చేసుకుంటాడో నే నూ అప్పుడే చేసుకుంటానని చెప్పాను."

"నేను ఎవ్వరినీ పెళ్ళి చేసుకోను. కాని నా మనసులో వున్న అమ్మాయి నా వద్దకు వచ్చి, నన్ను పెళ్ళి చేసుకో అని అడిగితే మాత్రం ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను."

"నేను కూడా అంతే ! నా మనసులో ఉన్న అబ్బాయి నా వద్దకు వచ్చి నన్ను పెళ్ళి చేసుకో అని అడిగితే ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకుంటాను."

"మీ మనసులో వున్న అబ్బాయి యెక్కడ ఉన్నాడో చెప్పండి !"

"నా కన్నుల్లో ఉన్నాడు చూడు !"

యాదగిరి శారదకు అతి సమీపంగా వచ్చి ఆమె కన్నుల్లోకి చూచి అన్నాడు. మీ మనసులో ఉన్న అబ్బాయి మీ కన్నుల్లో కనిపించాడు నాకు. కాని ... ....

"కానీ అంటూ ఆగావేమిటి ? ఏమిటి నీ అనుమానం ?"

"మీ నాన్నగారు పెళ్ళికి అభ్యంతరం చేస్తారేమో నని కొంచెం అనుమానంగా ఉంది !"

"నీ అనుమానం అలా ఉండనీ.... నీ మనసులో ఉన్న అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని నువ్వు మీ నాయనమ్మకు చెప్పావా ?"

:"చెప్పాను."

"ఏమంది మీ నాయనమ్మ ?"

"కోప్పడలేదు ...బాధ పడలేదు ...సంతోష పడ లేదు ....చేతులు పైకెత్తి అంతా దైవేచ్ఛ ! అంది. యెలా జరగాలని ఉంటే అలా జరుగుతుంది. అని వేదాంతం మాట్లాడింది.

మా ప్రత్యేక తయారింపులు ::
* 100% ఫైన్ * పాయల్ ఫైన్
* జిప్సీ ఫైన్ * మైసన్ ఫైన్
* రాకెట్ ఇంటర్ లాక్ * 100% పాయల్ కలర్ వెస్ట్స్
* 100% రిబ్ బ్రీవ్స్ * ట్రంక్స్ * మమతా ఫైన్
R.K.S. KNITTINGS TIRUPUR
Regd. No. 342215
Phone : 22016
R. K. S. Knittings
43, Cauvery St, TIRUPUR - 638 602

శారద ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండి పోయింది.

యాదగిరి కొడువలి పట్టుకొని ఓ అరటి చెట్టు దగ్గరకు వెళ్ళాడు. పండడానికి సిద్ధపడుతున్న దాని గెలను కోసి భుజాన పెట్టుకొని శారద వద్దకు వచ్చాడు. గెలను పరిశీలించి చూచి రెండు పండ్లు కోసి, శారద కిచ్చి అన్నాడు. "మీ మనసులో ఉన్న అబ్బాయికి ఈ అరటి పండ్లు ఇచ్చెయ్యండి!"

శారద గబగబా జామచెట్టు వద్దకు వెళ్ళి రెండు జామ పండ్లు తెంపుకొని వచ్చి, "చూడు గిరీ! నేను మనసారా ప్రేమించిన అబ్బాయికి ఈ అరటిపండ్లు ఇస్తున్నాను. నువ్వు కూడా నీ మనసులో ఉన్న అమ్మాయికి ఈ జామ పండ్లు ఇవ్వు" అంటూ రెండు అరటిపండ్లు, రెండు జామ పండ్లు యాదగిరి చేతిలో పెట్టింది.

"అమ్మాయిగారూ! నా మనస్సూ నా ప్రేమనూ ....నా సర్వస్వాన్నీ నేను మనసారా ప్రేమించిన అమ్మాయికి ఈ జామపండ్ల రూపంలో ఇస్తున్నాను" అని చెప్పి జామపండ్లు శారదకు ఇచ్చేసాడు.

ఇద్దరూ చెరొక అరటిపండూ, చెరొక జామపండూ మార్చుకొని తిన్నారు.

"అమ్మాయిగారూ! వివాహాలు యెనిమిది రకాలని చందమామ కథలో ఒకచోట చదివాను. వాన రోజు....ఆ గుడిసెలో....మనకు....వివాహం అయినట్టేనా!"


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

| | |
|---|---|
| విడి ప్రతి | ... 75 పైసలు |
| సంవత్సర చందా | ... రూ. 15-00 |

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును!

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 079.


శారద కాస్త సిగ్గు పడుతూ అంది. "అదీ ఒక రకమైన వివాహమే! నువ్వు నా భర్తవు - నేను నీ భార్యను. నిజం చెప్పనా గిరీ! ఆనాటి నుండి ఇంట్లో ఉన్నా, వీధిలోకి వచ్చినా, పని చేసినా, పడుకున్నా, చదువుతున్నా— ఎప్పుడూ నువ్వే నా మనసులో విహరిస్తున్నావు."

"నేను ఈ తోటలో పని చేస్తున్నా నన్నమాటే కాని చెట్టు చెట్టులో, ఆకు ఆకులో, పువ్వు పువ్వులో అంతటా మీరే కన్పిస్తున్నారు. నేను చదివిన చందమామ కథలో రాకుమార్తె మీరైనట్టూ, తోటమాలి నేనైనట్టూ అన్పిస్తూ వుంది. ఆ కథలో రాజకుమార్తెకు తోటమాలికి పెద్దల సమక్షంలో చివరికి పెళ్ళవుతుంది లెండి!"

"మనక్కూడా పెళ్ళి అవుతుం దంటావా గిరీ!"

"అనుమానం పెట్టుకోకండి అమ్మాయిగారూ!... చీకటి వచ్చేస్తోంది! ఇంటికి వెళ్ళిపోదాం పదండి!" అని చెప్పి అరటి గెలను భుజంమీద యెత్తుకొని ఇంటివైపు నడవ సాగాడు. అతని అడుగుల్లో అడుగులు వేస్తూ శారదకూడా నడవసాగింది.

"వాన వచ్చేలా వుంది. తొందరగా నడవండి అమ్మాయిగారూ! వేగంగా నడుస్తున్న యాదగిరి ఆగి వెనుదిరిగి అన్నాడు.

"నేను నీలాగా వేగంగా నడవలేను. నీ భుజం మీద బరువుంది నాకోసం ఆగకు వెళ్ళిపో!" అంటూ చెప్పేసింది శారద.

ఆకాశం మేఘాలతో నిండిపోయింది. ఉరుములతో - మెరుపులతో ఆకాశం అల్లకల్లోలంగా తయారయింది. వాన ప్రారంభమయింది.

మెరిసినప్పుడు దారి కన్పించినా, మెరుపు మాయం కాగానే యేమీ కన్పించడం లేదు. అంతా చీకటి—కటిక చీకటి —శబ్దం ...శబ్దం....భయంకరమయిన శబ్దం....అతి భయంకరమయిన శబ్దం ...ప్రాణాలను కబళించే పిడుగు ....పడిపోయింది.

ఆ పిడుగు తనమీదనే పడ్డట్టు భయపడి పోయింది శారద. క్షణకాలం శిలా విగ్రహంలా ఉండి పోయింది.

వాన కురుస్తూనే వుంది. పూర్తిగా తడిసిపోయిన శారద మెల్ల మెల్లగా నడవసాగింది.

మెరుపు మెరిసినప్పుడు కనిపించాడు యాదగిరి. అరటి గెలను వదిలేసిన యాదగిరి, దారిలో పడిపోయిన యాదగిరి. ఆమె గబగబా వెళ్ళి, యాదగిరిని తట్టి పిలిచింది, అనుమానం వచ్చి అతని చేయిపట్టి చూచింది.

"చిన్నా! అల్మాపురంలో ఓ సంబంధం వుందని తెలిసింది. నువ్వు పెళ్ళికి సుముఖంగా ఉంటే చెప్పు! ఆ సంబంధం ఖాయం చేయడానికి ప్రయత్నిస్తాను. పిల్లవాడు బుద్ధిమంతుడట! కరీం నగర్‌లో బి. ఏ., చదువుతున్నాడట! నిన్న సాయంత్రంపూట గ్రామ పంచాయితీ ఆఫీసు దగ్గర పరంధాములు మామ చెప్పాడు" అన్నాడు విశ్వనాథం.

"నాన్నా! మీరు గొప్ప మనసు కలవారు. అమ్మ లేక పోయినా, అమ్మా-నాన్న మీరే అయి పెంచారు. మీలాంటి ప్రేమమూర్తికి ఏ విషయం దాపరికం లేకుండా చెప్పడం మీ బిడ్డగా నా ధర్మం.... నేను.... నే నెవ్వరినీ పెళ్ళి చేసుకోను. పెళ్ళి కాకపోయినా, యాదగిరి ఈ లోకం నుండి వెళ్ళిపోయినా, యాదగిరే నా భర్త! అతడు మరో ఆరు నెలల్లో తండ్రి కాబోతున్నాడు.... ఈ కాగిదంలో కొన్ని విషయాలు రాసి వుంచాను. చదువుకోండి!" అని చెప్పి ఓ కాగిదం ఇచ్చి వెళ్ళిపోయింది!

అతడు ఆ కాగితాన్ని విప్పి అందులో వున్న విషయాలను రెండు సార్లు చదివాడు. ఇంతలో అక్కడికి పరంధాములు వచ్చాడు. విశ్వనాథం చూపించిన కుర్చీ లో కూర్చున్నాడు.

"ఔరా అల్లుడా! మనుమరాలు శారద నిప్పు లాంటి మనిషి కదా! మరి దాన్ని గురించి ఆడవాళ్ళు కొందరు కొత్త మాటలు మాట్లాడగా విన్నాను....అని చెప్పి అతడు విశ్వనాథం ముఖంలోకి చూచాడు.

విశ్వనాథం మాట్లాడలేదు.

"నేను ప్రొద్దున ఆ రావి చెట్టు క్రింది గద్దెమీద కూర్చుండి భారతం చదువుతున్నానురా. నీళ్ళకోసం వెళుతున్న ఆడవాళ్ళు మన శారద నెల తప్పినట్టు మాట్లాడారు. ఆ మాట్లాడిన ఆడవాళ్ళు అడ్డదిడ్డం మనుషులు కాదు. నా కప్పుడు కుంతీదేవి జ్ఞాపకం వచ్చిందనుకో!...."

విశ్వనాథం శూన్యంలోకి చూస్తూ మౌనంగా వుండిపోయాడు.

"నువ్వు బాధ పడకురా విశ్వం! జరిగిన సంగతి తెలుసుకొని దానికి న్యాయం జరిగేలా చూద్దాం!

విశ్వనాథం తన చేతిలో వున్న కాగితాన్ని పరంధాములుకు యిచ్చాడు. పరంధాములు కళ్ళద్దాలు పెట్టుకొని ఆ కాగితాన్ని చదివేసాడు.

"మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయంటారు. యిదే బాబోలు" కాగిదాన్ని విశ్వనాధముకు ఇస్తూ అన్నాడు పరంధాములు.

బపితా వారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు,
తయారించువారు :
Phone: 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur-638 602.

కొంచెం సేపు ఆగి మళ్ళీ అతడే అన్నాడు. "కట్నం ఎంత ఇచ్చినా, అమ్మాయి నెల తప్పిందని తెలిసాక పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడే మగాళ్ళు ఎంతమంది ఉంటారు ... కనుక జరిగిందేదో జరిగి పోయింది. ఈ విషయం ప్రచారములోకి రాకముందే ఆసుపత్రికి తీసుకపోయి కడుపు తీయించేస్తే బాగుంటుందేమో!...."

"ఎవరికి కష్టం వచ్చినా నీకే కష్టం వచ్చినట్టు భావించే మంచి మనిషివి మామయ్యా నువ్వు! మన మధ్య రక్త సంబంధం ఏమీ లేకపోయినా రక్త సంబంధాన్ని మించిన మంచి సంబంధం ఉంది. నాకేమీ తోచడం లేదు మామయ్యా! నువ్వే బాగా ఆలోచించి చెప్పు. ఏం చేస్తే బాగుంటుందో!"

"ఇది దాని జీవిత సమస్య! కనుక దాని అభిప్రాయం ఏమిటో తెలుసుకో ముందు. ఆ తర్వాత మనం ఆలోచిద్దాం. అని చెప్పి పరంధాములు వీధిలోకి వెళ్ళిపోయాడు

• • •

సంస్కారవంతులైన పెద్దలకు నమస్కారాలు. శారద రాసిన విషయాలు ఇప్పటికే మీ రందరూ చదివారు. సహజంగా శారద ఎలాంటి మనిషో మీ అందరికీ తెలుసు. శారద తన కడుపులో పెరుగుతున్న ప్రాణికి తల్లి అవుతాననే తెలియజేసింది...."

విశ్వనాథం మాటలకు అడ్డు వస్తూ ఆడిగాడో పెద్ద మనిషి, "శారద పెళ్ళి చేసుకోనందా?"

"చేసుకోనంది."

(సశేషం)